GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in


# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 8 | సంచిక :199 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం 25-12-2025 | పేజీలు : 3



# పల్లెలకు రూ.5,10లక్షల నిధులు

- ప్రతి పేద వాడికి సన్నబియ్యం
- కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- సన్మాన కార్యక్రమము లో సీఎం రేవంత్‌రెడ్డి

**పల్లెలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రామ పంచాయతీలకు యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామాలకు రూ.5లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.10లక్షలు చొప్పున ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు (స్పెషల్ డెవలప్‌మెంట్‌ఫండ్స్) కేటాయిస్తామని ప్రకటించారు. శాసన సభ్యులు, ఎంపీలు, మంత్రులతో సంబంధం లేకుండా ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను సన్మానించారు.**

**టీ మీడియా,డిసెంబర్ 24, కోస్గి :**
ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద అదనంగా నిధులు అందిస్తామని ప్రకటించారు. మేజర్ గ్రామ పంచాయతీలకు 10 లక్షల చొప్పున, చిన్న గ్రామ పంచాయతీలకు 5 లక్షల రూపాయల చొప్పున స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌గా నిధులు ఇందజేస్తామని చెప్పారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులకు ఈ నిధులు అదనమని స్పష్టం చేశారు. నూతన సంవత్సరంలో ఈ ప్రత్యేక నిధులను అందజేస్తామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామ సర్పంచులకు ప్రజల్లో గౌరవం, మర్యాద పెంచుతుందని చెప్పారు. గ్రామ సభలు పెట్టుకుని అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, గ్రామాల్లో ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడానికి దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కొడంగల్ శాసనసభ నియోజకవర్గంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్ల కోసం కోస్గీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ ప్రతినిధులను ముఖ్యమంత్రి గారు సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. "ప్రభుత్వం సర్పంచులకు అండగా నిలుస్తుంది. మార్చి 31 లోపు గ్రామ పంచాయతీలకు రావలసిన 3 వేల కోట్ల రూపాయలను తెప్పించే బాధ్యత తీసుకుంటా. గ్రామ సభలు పెట్టుకుని కార్యాచరణ రూపొందించుకుని అభివృద్ధి సాధించుకోవాలి. ఎన్నికలు ముగిసాయి. పార్టీలు పంథాలు ఎన్నికల సమయంలోనే. ప్రతి పౌరుడు మన కుటుంబ సభ్యుడే. ఎవరి పట్ల వివక్ష చూపరాదు. చెబితే వినలేదనో, ఎన్నికల్లో పోటీ చేశారనో ప్రత్యర్థులు గెలిచారనో కారణంగా వివక్ష చూపించరాదు. చిన్న చిన్న అభిప్రాయబేధాలు ఉంటే పక్కన పెట్టాలి. రాష్ట్రంలో పడావు పెట్టిన ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా ప్రారంభిస్తున్నాం. అనుమతులు సాధిస్తున్నాం. గత ప్రభుత్వంలో చేసిన 8 లక్షల కోట్ల అప్పులున్నాయి. ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తున్నాం. బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బీసీ, పాలమూరు - రంగారెడ్డి, మక్తల్ - నారాయణపేట ప్రాజెక్టులేవీ గత పదేళ్లలో పూర్తి చేయలేదు. చుక్క నీరివ్వలేదు. వాటన్నింటినీ చేపడుతాం. చదువు ఒక్కటే నిరుపేదల జీవితాలను మార్చగలదు. అందుకే వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందించే కార్యక్రమం చేపట్టబోతున్నాం. పేదలకు నాణ్యమైన విద్య, ఉన్నత ప్రమాణాలు కల్పించినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారు.
ప్రజలు ఆశీర్వదించి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్నాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రంలో అర్హులైన వారందరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చాం. ఇంకా ఎవరికైనా రాకపోతే సర్పంచులు ఇళ్లిళ్లు తిరిగి తేల్చితే ఇంకా రేషన్ కార్డులు రానివారికి ఇప్పించే బాధ్యత ప్రభుత్వానిది.

### ప్రతి పేదవాడికి సన్నబియ్యం

అర్హులైన ప్రతి పేద వాడికి సన్నబియ్యం అందాలి. రాష్ట్రంలో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఇంకా ఎవరికైనా రాకపోతే అందరికీ ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా 200 యూనిట్లలోపు వాడుకున్న వారికి ఉచిత విద్యుత్ అందకపోతే ఆ కుటుంబాల పేర్లను కూడా రాసుకోండి. రాష్ట్రంలో 69 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందించాం. ఇంకా ఎవరికైనా ఆ జాబితాలో పేర్లు రాకపోతే వారి పేర్లను కూడా నమోదు చేయండి. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఎవరైనా ఎక్కడైనా ప్రయాణం చేసినప్పుడు డబ్బు అడిగితే చెప్పండి.

### కోటి ఇందిరమ్మ చీరలను సారెగా

తెలంగాణ ఆడబిడ్డలు కోటిమందికి కోటి ఇందిరమ్మ చీరలను సారెగా అందించాలని నిర్ణయించాం. రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు చీర అందాలి. ఎవరికైనా అందకపోతే సర్పంచులు స్వయంగా వారి పేర్లను నమోదు చేయాలి. ప్రతి ఇంటికీ చీర చేయాల్సిందే. ప్రతి తండాకు, గ్రామానికి రోడ్లు, బడి, గుడి, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే కాకుండా పిల్లల భవిష్యత్తు కోసం నాణ్యమైన చదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కొడంగల్‌ను ఒక పెద్ద పారిశ్రామికవాడగా అభివృద్ధి చేసుకుంటున్నాం. కొడంగల్‌ను దేశానికి ఒక మాడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. జూనియర్, డిగ్రీ, అగ్రికల్చర్, మెడికల్ కాలేజీలతో పాటు సైనిక్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నాం. మొత్తంగా 250 ఎకరాల్లో కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నాం. కక్ష సాధింపు రాజకీయాలు చేయం. కష్టాన్ని నమ్ముకున్నాం. కొడంగల్ శాసనసభ నియోజకవర్గంలో 180 గ్రామ పంచాయతీల్లో ప్రజల తీర్పును గౌరవించి ఎన్నికైన గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను ప్రత్యక్షంగా కలవాలని, అభినందించాలని, వారు తిరిగి గ్రామాలకు వెళ్లి ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టుకుని ప్రజా సేవ చేయాలని ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నాం.

### కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

తెలంగాణ రాష్ట్రానికి కొడంగల్‌ను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా నిలబెట్టినందుకు అందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు. కొడంగల్ ప్రజలు నిండుమనసుతో ఆశీర్వదించి గుండెల్లో పెట్టుకుని భుజాలపై మోసినందునే ఈరోజు ముఖ్యమంత్రిని కాగలిగాను." అని అన్నారు.
ఈ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి వాకిటి శ్రీహరి గారితో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు, కొత్తగా ఎన్నికైన నియోజకవర్గంలోని గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డుమెంబర్లతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

---

## 'జీరో' పాఠశాలలు
# తాత్కాలికంగా మూసివేత

- 1,400కు పైగా బడులను యూడైస్ లెక్కల్లో చూపరు
- పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం



**టి మీడియా,డిసెంబర్ 24,హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఒక్కరూ లేని 'జీరో' ప్రభుత్వ బడులను తాత్కాలికంగా మూసివేయనున్నారు. వాటిని ఈ అకడమిక్ ఇయర్ (2025-26) నుంచి ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం (యూడైస్) గణాంకాల్లో చూపించరు. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ పాఠశాలల్లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది.

### రాష్ట్రంలో 2,245 జీరో పాఠశాలలు

2024-25 విద్యా సంవత్సరం లెక్కల ప్రకారం రాష్ట్రంలో 2,245 జీరో(ఒక్కవిద్యార్థి కూడా లేని) పాఠశాలలున్నాయి. వాటిలో పాఠశాల విద్యాశాఖ పరిధిలోనివే 2 వేలకుపైగా ఉన్నాయి. వాటిల్లో 1,441 స్కూళ్లలో పిల్లలు లేరు. టీచర్ల పోస్టులు లేవు. మరో 600 బడుల్లో విద్యార్థులు లేరు. టీచర్ పోస్టులున్నాయి. ప్రస్తుతానికి 1,441 పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయనున్నారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించి ఈ 600 పాఠశాలలపై అలాగే మిగతా శాఖల పరిధిలోని దాదాపు 200 జీరో బడులకు సంబంధించి ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.వాస్తవానికి తాత్కాలికంగా పాఠశాల మూసివేత అని కూడా అనరాదు అని ఓ విద్యాశాఖ అధికారి తెలిపారు. ప్రస్తుతం పనిచేయడం లేదు(ఇన్ ఆపరేషనల్) అనే అనే వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ గ్రామస్థులు తమ పిల్లల్ని బడికి పంపిస్తామని పాఠశాలలను తెరవాలని కోరినట్లయితే వెంటనే అందుబాటులోకి తెస్తామన్నారు. టీచర్‌ను నియమిస్తామని ఆయన వివరించారు. మారుమూల శివారు తండాల్లో కూడా ప్రజలు కోరడంతో ప్రభుత్వం ఈసారి 200 వరకు పాఠశాలలను కొత్తగా ఏర్పాటు చేసినట్లుగా ఆయన గుర్తుచేశారు.ఇప్పుడెందుకు ఈ నిర్ణయమంటే : కేంద్ర విద్యాశాఖ ప్రతి విద్యా సంవత్సరం యూడైస్ పేరిట పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరిస్తుంది. ఆ గణాంకాల ఆధారంగానే రాష్ట్రాల వారీగా పాఠశాలల పనితీరుకు సంబంధించిన గ్రేడింగ్ సూచిక(పీజీఐ) ఇస్తుంది. అంటే పాఠశాలల సంఖ్య, పనిచేసే టీచర్లు, విద్యార్థుల సంఖ్య, జీరో స్కూళ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ స్కోర్ నిర్ణయమవుతుంది.ఈ నేపథ్యంలో ఇక్కడా ఇతర రాష్ట్రాల విధానాన్ని పాటించాలని తెలంగాణ విద్యాశాఖ నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది.

### ఏకోపాధ్యాయ పాఠశాలలు తగ్గుముఖం

ఒక ఉపాధ్యాయుడితో నడిచే ప్రభుత్వ బడుల సంఖ్య క్రమేణా తగ్గుతుండటమనేది ఊరటనిచ్చే అంశం. 2022-23 విద్యాసంవత్సరంలో 6,054 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా 2023-2024లో ఆ సంఖ్య 5,895కి తగ్గింది. ఈసారి 2024-25 అకాడమిక్? ఇయర్?లో 5,001కి తగ్గడం గమనార్హం. వాటిల్లో 62,288 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆ పాఠశాలల్లో సగటు విద్యార్థుల సంఖ్య 12గా ఉంది.10 మందిలోపు విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలలు 12.70 శాతానికి పెరిగాయి. అంతకుముందు ఏడాది అది 11.60 శాతమే. ఈ అంశంలో జాతీయ సగటు 5.10 శాతమే. ఉత్తరాఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, లద్దాఖ్‌లలో మాత్రమే మనకంటే పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది.

### వచ్చే ఏడాది నుంచి సిలబస్‌లో ఏఐ క్లాసెస్

ప్రపంచమంతా శరవేగంగా సాంకేతికత వైపు అడుగులు వేస్తున్న వేళ ప్రభుత్వం సర్కారు పాఠశాలలో చదివే వారి కోసం సరికొత్త ఆలోచనలను చేస్తుంది. చిన్నతనం నుంచే వారిలో కృతిమ మేధస్సుపై(ఏఐ) మంచి పట్టును పెంచాలనే ఉద్దేశాన్ని కలిగి ఉంది. రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే సాంకేతికతను వినియోగిస్తుంది. కేంద్రం వచ్చే విద్యా సంవత్సరానికి 2026-2027 మూడో తరగతి నుంచే సిలబస్‌లో ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. అయితే రాష్ట్రం ఈ ఏడాది విద్య సంవత్సరంలోనే తేవటం విశేషం.

---

## 4 వరుసలుగా...
# బీజాపూర్

- హైదరాబాద్ రహదారి విస్తరణ పనులు ప్రారంభం
- ఇప్పటికే రూ.156.80 కోట్లు ఖర్చు



**టి మీడియా,డిసెంబర్ 24, బీజాపూర్ :** బీజాపూర్ - హైదరాబాద్ జాతీయరహదారి పేరు వింటే చాలు ప్రయాణికుల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. ఈ ఆ రోడ్డుపై ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని అంతా తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తుంటారు. ఇరుకుగా ఉండటం, విస్తరణకు నోచుకోకపోవడంతో ఈ హైవేపై ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అలాగే ఎంతో మంది తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు. అలాంటిది ఇన్నాళ్లకు ఆ రహదారికి మహర్దశ పట్టింది. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ కూడలి వరకు 46 కిలోమీటర్ల పొడవున 4 వరుసలుగా విస్తరణ పనులు సాగుతున్నాయి. అందుకు 956 కోట్లతో పనులను ప్రారంభించారు.

### విస్తరణ లేక ప్రమాదాలకు నిలయంగా

ఎప్పుడో పదేళ్ల క్రితం మంజూరైన జాతీయ రహదారి ఇది. సకాలంలో విస్తరణ జరగకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు అన్నారు. ఆ రహదారిపై ఏడాదిలో దాదాపు 365మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ రోడ్డుపై రాత్రిళ్లే కాదు పగలు ప్రయాణించాలన్నా అతి కష్టంగా మారిందని చెప్పారు. రహదారి విస్తరణ చేపట్టాలని స్థానికులు పదేపదే మొత్తుకున్నా ఇన్నాళ్లూ పాలకులు చూస్తూ ఉండిపోయారే తప్ప అడుగు ముందుకు పడడం లేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కానీ ఇటీవల జరిగిన ఆర్టీసీ బస్సు-టిప్పర్ ప్రమాదంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. దాంతో సత్వరమే మేల్కొని రహదారి విస్తరణకు పచ్చజెండా ఊపాయి.
46 కిలోమీటర్ల పొడవున 956 కోట్లతో పనులు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ కూడలి వరకు 46 కిలోమీటర్ల పొడవున 956 కోట్లతో పనులు ప్రారంభించారు. 18 అండర్ పాస్‌లు, 2 బైపాస్‌లతో రహదారి నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 156.80 కోట్లు ఖర్చు చేసి 266.55 హెక్టార్ల భూమి సేకరించారని అధికారులు చెప్పారు. ప్రకృతి ప్రేమికులు, పర్యావరణహితులు ఆకాంక్షించినట్లు ఒక్క మర్రి చెట్టు తొలగించకుండానే రహదారి విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. వీలైనంత తొందరగా పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రాణాల కంటే మర్రిచెట్లు ముఖ్యమా ?

వాస్తవానికి 2022 లోనే ఆ జాతీయరహదారి విస్తరణకు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శంకుస్థాపన చేశారు. కానీ దాని వల్ల రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్లకు నష్టం జరుగుతుంది. దాంతో సుమారు 84కు పైగా పక్షి జాతులు మనుగడకు ముప్పు వాటిల్లుతుందని పలు స్వచ్ఛంద సంస్థలు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. పక్షి మనుగడకు ఎలాంటి ముప్పు వాటిల్లడానికి వీలులేదని రోడ్డు విస్తరణ పనులు నిలిపేశారు. కానీ, ఇటీవల కాలంలో రోడ్డుపై జరుగుతున్న వరుసప్రమాదాలు స్థానికులను తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. మనుషుల ప్రాణాల కంటే మర్రిచెట్లు ముఖ్యమా అంటూ రాస్తారోకోలు, ధర్నాలు చేశారు.

### 19 మంది ప్రాణాలు కోల్పోవడంతో

ఇటీవల ఆర్టీసీ బస్సు-టిప్పర్ ఢీకొన్న ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఆ ప్రమాదంతో కోర్టు కేసును ఉపసంహరించుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మర్రిచెట్లను ట్రాన్స్ లొకేట్ చేయాలని కోరాయి. ఎన్?.హెచ్?.ఏ.ఐ స్వచ్ఛంద సంస్థలకు లిఖిత పూర్వక హామీ ఇవ్వడంతో రహదారి విస్తరణ పనులు జోరందుకున్నాయి. సాధ్యమైనంత త్వరగా విస్తరణ పనులు పూర్తిచేసేలా నిర్మాణ సంస్థ రేయింబవళ్లు పనిచేస్తోందని తెలిపారు. ప్రతి 10 కిలోమీటర్లకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి పనులు సాగిస్తోందని చెప్పారు. ఏడాదిలోపే హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

---



3లో..

## ముక్కిపోయాయి
# వర్షంలో కొట్టుకుపోయాయి!

---

## ముంబయి మేయర్
# పీఠం మాదే

**- 20 ఏళ్ల తర్వాత ఏకమైన ఠాక్రే సోదరులు**




**టి మీడియా,డిసెంబర్ 24, మహారాష్ట్ర :** మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఠాక్రే సోదరులు ఏకమయ్యారు. శివసేన అధినేత బాలాసాహెబ్ ఠాక్రే ఉన్నప్పుడే 2005లో ఆ పార్టీని వీడిన రాజ్ ఠాక్రే, ఇప్పుడు మరోసారి ఉద్ధవ్ ఠాక్రేతో జట్టు కట్టారు. ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఉద్ధవ్-రాజ్‌ఠాక్రేలు జనవరి 15న జరిగే బృహన్ ముంబయి మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని అధికారికంగా ప్రకటించారు. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మేయర్ పదవి తమదేనని శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ్‌సేన అధినేత రాజ్‌ఠాక్రేలు ధీమా వ్యక్తంచేశారు.

**'శిందే-శివసేన-బీజేపీలతో అసంతృప్తిగా ఉన్న నేతలంతా తిరిగి రావాలి'**

మిగతా 3లో..

# సవాల్‌తో కూడుకున్న ఎస్ఎల్‌బీసీ పనులు



## ఏటవాలుగా గ్రానైట్ పలకలు
## ఉపరితలంపై నీటి ప్రవాహాలు

**టి మీడియా,డిసెంబర్ 24, హైదరాబాద్ బ్యూరో :** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్సెల్బీసీ) సొరంగం తవ్వకాలకు నీటిపారుదల శాఖ తిరిగి సమాయత్తమవుతోంది. దీని కోసం నల్లమల భూమి పొరలను నిశితంగా పరిశీలిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీశైలం జలాశయం నుంచి నీళ్లు ప్రవేశించే మార్గంలో (ఇన్‌లెట్) 13.95 కిలో మీటరు వద్ద సొరంగం పైకప్పు కూలిన సంగతి తెలిసిందే. సొరంగం ఉపరితలంలోని భూ పొరల (స్ట్రాటా)పై ఇప్పటికే జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ(ఎన్జీఆర్ఐ) హెలీ బోర్న్ టెక్నాలజీ ఆధారంగా ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వే చేసింది. ఈ సమాచారాన్ని నిపుణులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు పైకప్పు కూలిన ప్రాంతంలో భూ ఉపరితలంలో భూమి పలకలు చాలా సంక్లిష్టంగా ఉన్నాయని గుర్తించారు. క్వార్ట్జ్, గ్రానైట్ రకాలకు చెందిన రెండు పలకలు భూమి ఉపరితలం నుంచి భూగర్భంలోకి ఏటవాలుగా ఉన్నట్లు తెలుసుకున్నారు. దీనికితోడు ఉపరితలంపై వాగులు, నీటి ప్రవాహాలు ఉండటంలో అక్కడి నుంచి ఊట నీరు ఈ పలకల గుండా భూమిలోపలి వరకు దిగుతున్నట్లు ఓ అంచనాకు వచ్చారు. ఈ పలకలు ఉన్న ప్రాంతాల్లో తవ్వకాలు వాస్తవానికి ఒక పరీక్ష లాంటివేనని నిపుణులు భావిస్తున్నట్లు సమాచారం.

### 200 మీటర్లకు ఒకసారి పరిశీలన

సొరంగంలో ఇంకా తొమ్మిదిన్నర కిలోమీటర్లు తవ్వాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకు ప్రవేశం, వెలుపలకి వెళ్లే మార్గాల్లో టన్నెల్ బోర్ యంత్రం (టీబీఎం) ద్వారానే తవ్వకాల పనులు చేశారు. పైకప్పు కూలిన ఘటనలో శ్రీశైలం జలాశయం నుంచి తవ్వే మార్గంలో టీబీఎం(యంత్రం) ధ్వంసం అయింది. దీన్ని ముక్కలు ముక్కలుగా కోసి వెలుపలకు తరలించారు. కృష్ణా జలాలు వెలుపలకు వచ్చే మార్గంలో దేవరకొండ వైపు కూడా టీబీఎంను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. టీబీఎం తవ్వకాల స్థానంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ విధానం (ఏటీఎం) అనుసరించి తవ్వకాలు చేపట్టాలని తాజాగా నిర్ణయించారు. ఈ పద్ధతిలోనూ పరిమిత డ్రిల్లింగ్, బ్లాస్టింగ్‌ను అనుసరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సొరంగంలోపల రోజుకు మూడు నుంచి నాలుగు వేల క్యూసెక్కుల నీటి ఊట వస్తోంది. దీన్ని తొలగిస్తూ తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. అయితే, భూమి పొరలు అంత భద్రంగా లేని (షీర్ జోన్) ప్రాంతాల్లో ఉన్నట్లు ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సర్వేలో గుర్తించిన సమాచారాన్ని భౌతికంగా పోల్చుకుంటూ తవ్వకాలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎన్జీఆర్ఐ రూపొందించిన సర్వే డేటాను ప్రభుత్వ సలహాదారు, సొరంగాల నిపుణుడు బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్‌కు చెందిన కర్నల్ పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో నిపుణులు నిశితంగా అధ్యయనం చేస్తున్నారు. వారం రోజుల్లో తవ్వకాలు ప్రారంభించేందుకు రోడ్ మ్యాప్‌ను సైతం సిద్ధం చేసుకుని ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహించేందుకు నీటిపారుదల శాఖ ఇప్పటికే సిద్ధమవుతోంది.

### నాడు షీర్‌జోన్‌లోనే కూలిన పైకప్పు

సొరంగం పైకప్పు కూలిన ప్రాంతంలో రెండు రాతి పలకలు, బలహీనమైన మట్టి ఉన్నట్లు ఇటీవలి సర్వేలో నిపుణులు గుర్తించినట్లు తెలిసింది. దీంతోనే ఉపరితలం నుంచి సొరంగంలోకి నీటి ఊట పెద్దఎత్తున వచ్చిందని భావిస్తున్నారు. అప్పట్లో ఊటను నియంత్రించేందుకు పీయూ కాంక్రీట్ మిక్చర్‌తో పంపింగ్ చేస్తూ, ఎక్కడికక్కడ నియంత్రిస్తూ సొరంగం తవ్వకాన్ని నెమ్మదిగా పూర్తి చేస్తూ ముందుకు వెళ్లారు. ఈ క్రమంలో భూమి పొరల్లో నీటి ఊట, లూజ్ మట్టి పేరుకుపోయాయి. ఈ ప్రాంతాన్ని షీర్‌జోన్‌గా గుర్తించి నెమ్మదిగా పనులు చేపట్టినా చివరికి ఫిబ్రవరిలో ఒక్కసారిగా పైకప్పు నుంచి పెద్ద ఎత్తున నీళ్లు, బురదతో పైకప్పు కూలి పనిచేస్తున్న కార్మికులపై పడింది. ప్రస్తుతం ఇక్కడ పనులు చేపట్టడం ఒక సవాలేనని, అత్యాధునిక టెక్నాలజీ, నిశిత పరిశీలనతో పూర్తి చేయాల్సి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## మున్సిపల్ ఎన్నికల సన్నాక సమావేశం

**-పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి**



**టీ మీడియా, డిసెంబర్ 24, ఆత్మకూరు :** మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు పట్టణం లో జరిగిన స్థానిక మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం లో పాల్గొన్నారు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు మండలం లో మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 90 శాతం అభ్యర్థులు గెలిచిన విధంగానే రేపు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వందకు వంద శాతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణం లో ఎప్పుడూ లేని విధంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. 50 పడకల ఆసుపత్రి, 123 కోట్ల తో జూరాల వద్ద బ్రిడ్జ్ నిర్మాణం, డ్రైనేజీ కాలువలు, మినీ స్టేడియం లాంటి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలియజేశారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు.

బి.ఆర్. ఎస్ కు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు తనపై చేసిన విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. తాను పార్టీ మారతానని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సమాధానంగా మంత్రి మాట్లాడుతూ తాను ఎప్పుడూ కాంగ్రెస్ వాదినే అని, తనకు పార్టీ మారాల్సిన అవసరం లేదని తెగేసి చెప్పారు.

జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లు కట్టిందే కాంగ్రెస్ పార్టీ హయాం లో అని, ఇన్నేళ్ళైనా ఆ ప్రాజెక్ట్ లు చెక్కుచెదరలేదన్నారు. మీ హయాంలో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కొన్నాళ్లకే కూలడం ప్రారంభించిందని మంత్రి ఎద్దేవా చేశారు. బి.ఆర్.ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నామని ఏవో పనికిరాని మాటలు చెప్తూ కాలం వెల్లదీస్తున్నారని మంత్రి విమర్శించారు. మక్తల్ నియోజకవర్గ ప్రజలు చాలా తెలివివంతులని, అభివృద్ధిని అడ్డుకోవాలని చూసినవారికి కర్రు కాల్చి వాత పెడతారని మంత్రి అన్నారు. అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కనండి వాటిని సాకారం చేయండి అనే నినాదం స్ఫూర్తితో ముందుకెళ్తున్నామని మంత్రి తెలియజేశారు. మక్తల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గం గా తాను కన్న కలలను సాకారం చేసే దిశగా పయనిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజా పాలనలో ఎవరు ఎక్కువ తక్కువ కాదన్నారు మంత్రి వాకిటి శ్రీహరి

ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ రహమతుల్లా, ఆత్మకూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేశ్వర్, తులసిరాజ్ యాదవ్ నల్లగొండ శీను, అక్షర దామోదర్, వెంకట నరసింహారావు, అక్షర నగేష్ బాలకృష్ణారెడ్డి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ



టీ మీడియా,డిసెంబర్ 24, ఎండపల్లి: మండలం,కొత్తపేట గ్రామంలో పశువైద్య అధికారి డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నట్టలనివారణమందుల పంపిణీదకార్యక్రమాన్ని నిర్వహించారు.నట్టలనివారణ పంపిణిలో956గొర్రెలు, 313మేకలకునట్టల నివారణ మందులనుఉచితంగాఅందించారు. ఈకార్యక్రమానికిగ్రామసర్పంచ్రెడ్డిమహేందర్రెడ్డిముఖ్యఅతిథిగాహాజరయ్యారుఈసందర్భంగాఆయనమాట్లాడుతూ.పశుపోషణద్వారాగ్రామీణ ఆర్థికవ్యవస్థబలోపేత మవుతుందని, ప్రభుత్వంఅందిస్తున్న ఈసేవలను పశు పోషకులుసద్వినియోగం చేసుకోవాలనికోరారు. తదానంతరం. డాక్టర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ.పశువుల ఆరోగ్యానికి నట్టల నివారణ ఎంత ముఖ్యమో,వాటి పెంపకందారులుపాటించాల్సిన మెళకువల గురించి అవగాహనా కల్పించారు.ఈ కార్యక్రమం లో పశువైద్య అధికారిడాక్టర్ మనోజ్ కుమార్,లైవ్స్టాక్ అసిస్టెంట్రాజేందర్,లక్ష్మి,నవీన్,పశుయాజమానులుకాసడినరసయ్య,సోనవేణిగంగమల్లు,పెద్దిమల్లేశం,కొమురయ్య,తదితరులుపాల్గొన్నారు.

## పోలీసుల నాకాబందీ



**టి మీడియా,డిసెంబర్ 24,లక్షెట్టిపేట :** మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తా వద్ద బుధవారం లక్షెట్టిపేట పోలీసులు నాకాబందీ నిర్వహించారు. లక్షెట్టిపేట ఎస్సై గోపతి సురేష్ సిబ్బందితో కలిసి వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరు కూడా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టకుండా ముందస్తు చర్యలో భాగంగా తనిఖీలు చేపట్టామన్నారు.వాహనదారులు రవాణా నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలు వాహనాల వెంట ఉంచుకోవాలని, వాహనాలు నడిపే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మత్తు పదార్థాలైన గంజాయి లాంటి వాటికి బానిస కాకూడదని, అలాంటివి రవాణా చేసినా, తరలించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి తనిఖీలు చేస్తూ వాహనాలు ఎవరివి ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నాయని వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముంబయి మేయర్ పీఠం మాదే

అదే రోజు జరిగే నాశిక్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం ఇప్పటికే రెండు పార్టీల మధ్య స్థానాల సర్దుబాటు చర్చలు పూర్తయ్యాయని 20 ఏళ్ల తర్వాత ఒక్కటైన ఠాక్రే సోదరులు ప్రకటించారు. త్వరలో ముంబయికి తమ పార్టీల నుంచి మరాఠీ మేయర్ రాబోతున్నారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇచ్చిన బటేంగే తో కాటేంగే నినాదాన్ని జపించిన ఉద్ధవ్‌ఠాక్రే, ఐక్యత లోపిస్తే పరిస్థితి వినాశకరంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. శిందే-శివసేన-బీజేపీలతో అసంతృప్తిగా ఉన్న నేతలంతా తిరిగి తమ పార్టీల్లో చేరాలని రాజ్‌ఠాక్రే పిలుపునిచ్చారు.

### 20 ఏళ్ల తర్వాత ఏకమైన ఠాక్రే సోదరులు

2005లో శివసేన అధినేత బాల్‌ఠాక్రే బతికి ఉన్నప్పుడు ఉద్ధవ్, రాజ్‌లు విడిపోయారు. అప్పట్లో ఉద్ధవ్‌ను కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాల్ ఠాక్రేను నియమించడంపై అసంతృప్తితో రాజ్, శివసేనను వీడి, మన్స్ పార్టీని స్థాపించారు. తర్వాత మహారాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చాయి. ఉద్ధవ్ నేతృత్వంలో శివసేన తమ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న బీజేపీని విడిచిపెట్టి కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. తర్వాత మహారాష్ట్రలో బీజేపీ బలోపేతం కావడం, శివసేనను ఏక్‌నాథ్ శిందే రెండు వర్గాలుగా చీల్చడం వంటి కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, శివసేన-, శరద్‌పవార్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీని తిరస్కరించారు. ఈ క్రమంలో మరాఠీ భాష ప్రాధాన్యానికి సంబంధించిన పరిణామాలు వీరిద్దరిని మళ్లీ దగ్గరకు చేర్చాయి. 20 ఏళ్ల తర్వాత మళ్లీ వారిద్దరు ఒక్కడవడం మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది.

### ఇద్దరు సోదరులకు దూరంగా కాంగ్రెస్

ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఆర్థికంగా దేశంలోనే అతిపెద్దది. ముంబయి బడ్జెట్ కేరళ రాష్ట్ర బడ్జెట్‌కు సమానం. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌పై నియంత్రణ సాధించడం అత్యంత కీలకంగా మారడంతో ఉద్ధవ్, రాజ్ జట్టు కట్టారు. మరోవైపు హిందీ మాట్లాడే ఓటర్లను దూరం చేసుకోకుండా ఉండేందుకు కాంగ్రెస్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ ఇద్దరు సోదరులకు దూరంగా ఉండనుంది. ఈ ఎన్నికలు ఠాక్రే బ్రాండ్ పేరుకు ముంబయి ఓటర్లు ఎంత ప్రాధాన్యం ఇస్తారో తెలియజేస్తాయి. అందుకే యావత్ దేశం దృష్టి ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై కేంద్రీకృతమై ఉంది.కాగా, బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు 28 కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అలాగే 32 జిల్లాల కౌన్సిళ్లు, 336 పంచాయతీ సమితులకు ఒకేవిడతలో ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశాయి. ఇదొక చరిత్రాత్మక ప్రారంభమని ఉద్ధవ్ పార్టీ నేత సంజయ్ రౌత్ అభివర్ణించారు.

## ఆయిల్ పామ్ లక్ష్యాలను సాధించాలి

**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**టి మీడియా,డిసెంబర్ 24, వనపర్తి:** జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆయిల్ పామ్ సాగు లక్ష్యాల అంశంపై ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఆయిల్ ఫామ్ సాగుకు సంబంధించి ప్రభుత్వం నుంచి 3500 ఎకరాల విస్తీర్ణం లక్ష్యం నిర్దేశించబడిందని చెప్పారు.కానీ సంబంధిత శాఖల అధికారులు సరైన విధంగా దృష్టి సారించకపోవడం కారణంగా లక్ష్యాలను చేరుకోలేకపోతున్నట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి 5 ఎకరాల పైబడి భూమి కలిగి ఉండి బోరు సదుపాయం ఉండి, ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి కలిగి ఉన్న రైతులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సదరు రైతులను గుర్తించి వారి జాబితాను ఉద్యాన శాఖకు అప్పగించాలని ఆదేశించారు. రాబోయే వారం రోజుల్లో ఈ ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిచేయాలని ఆదేశించారు.

వరి కన్నా ఆయిల్ పామ్ సాగు చేయడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వారికి తెలియజేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. తద్వారా రైతులు ఆ పంటకు వెళ్లడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ప్రియునిక్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్న ఫ్యాక్టరీ పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని సదరు కంపెనీ అధికారులను కలెక్టర్ నిలదీశారు. ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయకపోతే రైతుల్లో సాగు చేసేందుకు భరోసా ఏ విధంగా కనిపించగలమని ప్రశ్నించారు.త్వరితగతిన ఫ్యాక్టరీ నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా కంపెనీ యాజమాన్యానికి తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా రైతులు రబీ సీజన్లో దొడ్డు రకం ధాన్యం వేయకుండా సన్న రకం ధాన్యానికి బోనస్ సదుపాయం ఉందని తెలియజేసి సన్న రకం వరి ధాన్యాన్ని సాగు చేసే విధంగా సూచనలు చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ ఏడి దామోదర్, విద్యాశాఖ అధికారి విజయభాస్కర్ రెడ్డి, ఎంఏవోలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ నాయక్ బినామీ.. డ్రైవరే ?



**టి మీడియా,డిసెంబర్ 24, మహబూబ్ నగర్ :**డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కిషన్ నాయక్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ దర్యాప్తులో కీలకమైన అంశం కిషన్ ప్రైవేట్ డ్రైవర్ అయిన ఎనుగు శివశంకర్. కిషన్‌కు చెందిన ఆస్తులను దాచిపెట్టడానికి శివశంకర్ బినామీగా వ్యవహరించాడని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. శివశంకర్ పేరు మీద రిజిస్టర్ అయిన మూడు కార్లతో సహా పలు విలాసవంతమైన వాహనాలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి.దాడుల సమయంలో స్వాధీనం చేసుకున్న నగదు, విలువైన వస్తువులు శివశంకర్ పేరు మీద ఉన్నప్పటికీ, అవి వాస్తవానికి కిషన్‌కు చెందినవేనని ఏసీబీ భావిస్తోంది. అల్వాల్‌లో ఉన్న అత్యాధునిక ఇల్లుతో సహా కిషన్ జీవనశైలి, అతని తెలిసిన ఆదాయానికి సరిపోలడం లేదని సమాచారం. ఆసక్తికరంగా, అతను తన వృత్తి గురించి కింది అంతస్తులో ఉన్న అద్దెదారులకు తప్పుగా చెప్పి, తాను ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌నని వారితో చెప్పినట్లు తెలుస్తోంది. డ్రైవర్ శివశంకర్ ఏసీబీ దాడుల తర్వాత అదృశ్యమయ్యాడు. అతని అరెస్టు చాలా కీలకమని అధికారులు భావిస్తున్నారు. ఎందుకంటే దీని ద్వారా ఆర్థిక నెట్‌వర్క్ , డీటీసీకి సంబంధించిన బినామీ ఆస్తుల పూర్తి స్థాయి వివరాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

## క్రిస్మస్ వేడుకలకు ఆలయాలు ముస్తాబు



**టి మీడియా,డిసెంబర్ 24,బెల్లంపల్లి:** క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం అయ్యింది. పట్టణంలోని క్రైస్తవ మందిరాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా క్రైస్తవ సోదరులు జరుపుకానున్నారు. క్రైస్తవల ఆరోగ్య దైవం ఏసుక్రీస్తు పుట్టినరోజును క్రిస్మస్ వేడుకలుగా జరుపుకుంటారు. పట్టణంలోని సీఎస్ఐ, పెంతకొస్తూ, జేసుతీరు హృదయం తదితర ఆలయాలను అందంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో ఆలయాలను అలంకరించారు. విద్యుత్ దీపాలతో ఆలయాలు ఆకట్టుకుంటున్నాయి.క్రిస్మస్ ముందస్తు వేడుకలు గత పక్షం రోజులుగా బెల్లంపల్లిలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు బుధవారం రాత్రి నుంచే ఆలయాల్లో ప్రార్థనలతో వేడుకలు ప్రారంభమవుతాయి. ఆయా ప్రార్థనా మందిరాలకు క్రైస్తవులు కుటుంబ సమేతంగా చేరుకుంటారు. భక్తిశ్రద్ధలతో సామూహిక ప్రార్థనలు జరుపుతారు. క్రైస్తవ దేవాలయాల వద్ద వేడుకల సందడి నెలకొన్నది. వేడుకల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. సామూహిక ప్రార్థనలకు దేవాలయాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. ఎప్పుడెప్పుడాని క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పర్వదినం కోసం ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

### ఏసుక్రీస్తు పుట్టిన పాక ఏర్పాటు

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని బెల్లంపల్లిలోని ఆయా దేవాలయాల్లో క్రీస్తు పుట్టిన పాకను ఏర్పాటు చేశారు. క్రీస్తు పుట్టిన పాక వద్ద క్రైస్తవ భక్తులు ముందుగా ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. అటు తర్వాత ఆలయాల్లోకి వెళ్ళి సామూహిక ప్రార్థనలు జరుపుతారు. ఈ వేడుకల సందర్భంగా క్రీస్తు జననం జరిగిన పాకను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య ఘట్టం. కాగా ఈ సన్నివేశాన్ని క్రైస్తవ సోదరులు ఎంతో ఆసక్తితో తిలకిస్తారు.

## ముగిసిన ఐకాన్ జెమ్ అంతర్జాతీయ సదస్సు



**టి మీడియా,డిసెంబర్ 24,ఘట్ కేసర్:** వెంకటాపూర్ లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న ఐకాన్ జెమ్-2025 అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. భౌతిక శాస్త్ర విభాగం నిర్వహించిన రెండు రోజుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ హాజరయ్యారు. ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రేరేపించే స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు.విద్యార్థులను పరిశోధన వైపు ప్రేరేపించడం ఉపాధ్యాయుల విధి అని ఆయన పేర్కొన్నారు. అనురాగ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ అర్చన మంత్రి, పరిశోధనా వాతావరణాన్ని ప్రపంచ స్థాయికి మెరుగుపరచడానికి అనురాగ్ విశ్వవిద్యాలయం యొక్క పరిశోధన సౌకర్యాల భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికను పంచుకున్నారు. భవిష్యత్తులో భౌతిక శాస్త్ర విభాగం నుండి ఇలాంటి సమావేశాలు మరిన్ని జరగాలని ఆమె ఆకాంక్షించారు.సమావేశ అధ్యక్షులు డాక్టర్ ఎంవి రమణ సమావేశం ముగింపు వ్యాఖ్యలను ప్రతిపాదించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి నిరంతర సహకారం అందించిన ముఖ్య అతిథులు, ఆహ్వానితులైన వక్తలు, పాల్గొన్నవారు, అనురాగ్ విశ్వవిద్యాలయ యాజమాన్యం, సహాయక సిబ్బంది, ఈవెంట్ మేనేజర్లు, విద్యార్థి వాలంటీర్లకు కాన్ఫరెన్స్ చైర్‌పర్సన్లు డాక్టర్ ఎం.వి. రమణ, డాక్టర్ ఎం.ఎస్. రెడ్డి, కన్వీనర్లు డాక్టర్ శ్వేత, డాక్టర్ సమీరా దేవి, ఐకాన్ జెమ్-2025 నిర్వాహక కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

## ముక్కిపోయాయి వర్షంలో కొట్టుకుపోయాయి!

**-నిల్వ ఉన్న దొడ్డు బియ్యం వేలం**

**-అవకతవకలు కప్పిపుచ్చే ప్రయత్నం**

**టి మీడియా,డిసెంబర్ 24, హైదరాబాద్ బ్యూరో :** ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్?) ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ గోదాముల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించింది. పంచాయతీ ఎన్నికల కోడ్ పూర్తయిన నేపథ్యంలో త్వరలో టెండర్లు పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి మిగిలిన దొడ్డు బియ్యం దుకాణాల్లో నిల్వ చేయలేక స్థలం కొరత కారణంగా రేషన్ డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దొడ్డు బియ్యం నిల్వలపై అనుమానాలు

రాష్ట్ర ప్రభుత్వం గత ఏప్రిల్ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో ఒక్కో చౌక ధరల దుకాణం పరిధిలో 20 నుంచి 50 క్వింటాళ్ల వరకు దొడ్డు బియ్యం నిల్వ ఉంది. అయితే అప్పటివరకు రేషన్? షాప్?లలో దొడ్డుబియ్యం నిల్వలు సరిగ్గా ఉన్నాయో లేదోనని అధికారులు లెక్కించలేదు. మరోవైపు 9 నెలలుగా నిల్వలపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం వల్ల బియ్యం నిల్వల్లో జరిగిన అవకతవకలను రేషన్ డీలర్లు కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

తప్పుదోవ పట్టించే అవకాశం

వరంగల్ జిల్లాలోని రామన్నపేటలో భారీ వర్షాలతో నిల్వ చేసిన దొడ్డు బియ్యం మొత్తం వరదకు కొట్టుకుపోయిందని ఇటీవల ఓ డీలర్, పౌరసరఫరాలశాఖ అధికారులను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేశారు. దుకాణంలోని బియ్యం నిల్వలను పరిశీలించగా సుమారు 100 క్వింటాళ్ల వరకు తేడాలు రావడంతో అతడిపై 6ఏ కేసు నమోదు చేశారు. అయితే రేషన్ దుకాణాల్లో నిల్వ చేసిన బియ్యాన్ని చాలావరకు డీలర్లు ఇప్పటికే విక్రయించుకుని లబ్ధి పొందినట్లుగా తెలుస్తోంది. దీంతో వేలం సమయానికి దొడ్డుబియ్యం పందికొక్కులు తిన్నాయని, వాన నీటికి తడిసి ముక్కిపోయాయని అధికారులను తప్పుదోవ పట్టించేందుకు అవకాశం ఉంది.

వరంగల్ జిల్లాలో 1,020 మెట్రిక్ టన్నులు

వరంగల్ జిల్లా పరిధిలోని 509 చౌక ధరల(రేషన్) దుకాణాలకు ప్రతినెలా 5,014.541 మెట్రిక్ టన్నుల బియ్యం కోటాను కేటాయిస్తారు. అయితే గత ఏప్రిల్ నెల నుంచి రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యంతో పాటు అదనంగా ఎంఎల్ఎస్ పాయింట్లు, బఫర్ గోదాముల్లోనూ టన్నుల కొద్దీ బియ్యం నిల్వలున్నాయి. రేషన్ షాప్?లలో 847.356 మెట్రిక్ టన్నులు, గోదాముల్లో 1,020 మెట్రిక్ టన్నులు దొడ్డు బియ్యం నిల్వలున్నట్లుగా అధికారుల ప్రాథమిక నివేదికల ద్వారా తెలుస్తోంది.

ప్రభుత్వ గోదాముల్లో నిల్వలు

పలు చౌకధరల దుకాణాల్లో దొడ్డుబియ్యం బస్తాలకు ఏకంగా పురుగులు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. చాలాచోట్ల ఎలుకలు, పందికొక్కుల బెడదతో వాటిని కాపాడుకొనేందుకు అదనపు ఖర్చు చేయాల్సి వస్తోందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన గోదాముల్లో నిల్వ ఉన్న వాటి పరిస్థితి కూడా ఇలానే ఉంది.

బియ్యం బస్తాల వద్ద గమ్ ప్యాడ్

దొడ్డు బియ్యంను భద్రపర్చేందుకు అదనంగా తమ జేబులో నుంచి ఖర్చు చేయాల్సి వస్తోందని రేషన్? డీలర్లు వాపోతున్నారు. ఎలుకలు బస్తాలన్నీ కొరుకుతూ బియ్యాన్ని మొత్తం చిందర వందర చేస్తున్నాయని, ఎలుకలను పట్టి దూరంగా వదిలేసేందుకు గమ్‌తో ఉండే అట్టలను ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. ఇందుకు అదనంగా ఖర్చు చేయాల్సి రావడం వల్ల తమకు ఇబ్బందిగా ఉందని ఓ రేషన్ డీలరు తెలిపారు. బియ్యం నిల్వలు ఎక్కువగా ఉండటం వల్ల ఎలుకలు, పందికొక్కులు ఇంట్లోకి వస్తున్నాయని మరో డీలరు వాపోయాడు. వీటి రికవరీకి ఆలస్యం చేస్తే తూకంలో వ్యత్యాసాన్ని తమ నుంచి వసూలు చేస్తారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దొడ్డు బియ్యం వేలం వేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టినట్లుగా తెలుస్తోంది.

